# నేరము - శిక్ష

రచన:
శ్రీ వై. వి. రాజారావ్.

అమావాశ్య అర్ధరాత్రి. కళ్ళుపొడుచుకొన్నా కానరాని కటిక చీకటి. ఆ ప్రదేశం యెంతో నిర్మానుష్యంగా వుంది.

అది పెద్ద వోపెన్ స్పేస్. ఆర్ట్సు కాలేజ్ కెదురుగా పోలీసు హాస్పిటల్, గ్రౌండ్ మధ్యలో ప్రిన్సిపాల్ కమలాకర్ గారి యేకాంతభవనం, గ్రౌండ్ కు ఈ చివరభాగంలో పోలీస్ హాస్పిటల్ బిల్డింగ్. అందులో వున్న కుడివైపు చిన్న రూంలో అక్కడ పనిచేసే కుక్ వొంటరిగా వుంటున్నాడు. అతనిపేరు చెంగయ్య.

చెంగయ్యకి ఆ వేళెందుకో నిద్రపట్టలేదు. గాలికోసం పట్టెమంచం ఆరు బయటవేసుకొని పడుకొన్నాడు. గంటక్రితం చెంగయ్య దేన్ని గూర్చో ఆలోచిస్తూ పడుకొన్నాడు.

అప్పుడే కొంచెం దూరంలోవున్న చర్చి నుంచి ఠంగ్ మని 2 గంటలు వినపడ్డాయి.

ఇంతలో యెవరో గాభరాగా పరుగిడుతున్నట్టు అడుగులశబ్ధం వినబడ్డది. ఎవరో వ్యక్తి చేతిలో యేదోపట్టుకొని ప్రిన్సిపాల్ గారి భవనంనుండి రోడ్ వైపు పరుగిడుతున్నట్టు తెలిసొచ్చింది. ఆ చీకట్లో వో ఆకారం మాత్రం నల్లగా పారిపోతున్నట్టు అగుపించింది.

ఇంతలో, ప్రిన్సపాల్ గారింట్లో లైట్లు వెలిగాయ్. 'దొంగ, దొంగ పారిపోతున్నాడు పట్టుకోండి,' అన్న కేకలు గాభరాగా వినపడ్డాయ్. కానీ యెవరూ సాహసించి అతడి వెంట వెళ్ళలేకపోయారు. పాపం వారింట్లో మగవారెవ్వరూ లేనట్టుంది. ఆడవారి గొంతె వినపడ్డది. చెంగయ్యలో యెందుకో వుద్రేకం హెచ్చింది. ఏమనుకొన్నాడో యేమో, మరుక్షణంలోనే పంచె పైకి యెగకొట్టి, రూములోనికెళ్ళి, పిడిబాకు తీసుకొని వక్కగంతులో ఆ పారిపోతున్న ఆగంతకుడి వెనక వెళ్ళి వొక్కగ్రుద్దు వీపులో గ్రుద్దాడు. ఆ దెబ్బకు వాడు అమాంతంక్రింద జోర్లాపడిపోయాడు. ఇంకేముంది, యిదే మంచి సమయమని, చెంగయ్య తన మొలలోవున్న పిడిబాకులో, ఆ దొంగ వీపులో బలంగా పొడిచాడు. ఆ దెబ్బతో ఆ దొంగ 'అమ్మా!' అంటూ వో చావు కేక పెట్టాడు. ఆ మరుక్షణంలోనే, అతడి చేతిలోవున్న మూటను క్రిందికి వదలి పెటాడు. అతడి శరీరం రక్తపు మడుగులో కొటుకులాడు సాగింది. ఆ కేక విని ప్రిన్సిపాల్ గారింట్లోనుంచీ, నలుగు రైదుగురు పరుగెత్తుకొచ్చారు ఆ గ్రౌండ్ లోకి, చేతిలో వో హరికెన్ లైటుతో సహా. మరో పదినిముషాల్లో చాలామంది జనం ప్రోగయ్యారా ప్రాంతంలో.

అక్కడ జరిగిన సంగతి అందరికి అర్ధం అయింది.

అంత సాహసం చేసిన చెంగయ్యను పదిమంది యెంతో పొగిడారు. సొమ్ములు, పైకం పోకుండా రక్షించినందుకు చెంగయ్యకు కృతజ్ఞత తెలియబరచి, ఆ మూట చేతికి తీసుకొన్నారు.

'అయ్యో మరెవరో కాదురో రౌడీ రంగడు!' అన్నారెవరో. అంతె! 'రంగడు' అన్న మాట విని మరుక్షణంలో చెంగయ్య ఆ రక్తపు మడుగులో పడి పొర్లుతున్న వ్యక్తిని యిటువైపు త్రిప్పిచూచాడు; అవును నిజంగా తన స్నేహితుడు రంగడే! 'అయ్యో ఎంత అన్యా

యం జరిగిపోయింది భగవాన్!' మరు క్షణం లోనే, చెంగయ్య మనసు యెంతో విలపించింది: అంతే కాదు. చెంగయ్య రంగడు శరీరంపైన పడి యిలా వాపోయ్యాడు :

'ఒరే రంగా నేను నిజంగా పాపినిరా నీ ప్రాణాల్ని నా చేతులారా తీశాను. నీ భార్యా బిడ్డలకి యెంతో అన్యాయం చేశాను. నన్ను క్షమించవురా? నన్ను క్షమించు...' కొనవూపిరితో వున్న రంగడు గొంతునుండి యేవో మాటలు అస్పష్టంగా వెలువడ్డాయి, యిలా : 'ఒరె! చెంగయ్యా! ఇందులో నీ తప్పేమీ లేదు. తప్పంతా నాదే. అయినా ఈ పొరబాటు నీవు తెలిసి చేయలేదుగా! నే నిన్నాళ్ళుగా చేశిన అన్యాయాలకి అక్రమాలకి ఈ రోజునుంచీ విముక్తి కలుగుతుంది. నా ఆత్మకు శాంతి కలుగ చేశావు. నన్నుగూర్చి చింతించకురా. నా భార్యా, పిల్లల్ని-మాత్రం...! అంతే తరువాత మాటలు వెలువడలేదు. రౌడీరంగడు ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమయిపోయాయి. చెంగయ్య రంగడు శవంపైనపడి బావురుమన్నాడు.

\+ \+ \+

మరుసటిరోజు చెంగయ్యను హత్యానేరం క్రింద అరెస్ట్ చేశారు. కోర్టులో కేస్ రిజిష్టర్ చేయబడింది. ప్రాసిక్యూషన్ తరుపున సబ్ యిన్స్పెక్టర్ వాదించాడు. డిపెన్స తరపున, ప్రిన్సిపాల్ సాక్ష్యం యిచ్చాడు చెంగయ్యకి. వారంరోజుల తరువాత, జడ్జి తీర్పుయిచ్చాడు. కోర్ట్లో ఈ విధంగా :

'ఈ కేసులోని విషయాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించినమీదట వో పెద్ద రౌడీ, పబ్లిక్ న్యూసెన్సు బారినుండి ప్రజలకు విముక్తి కలిగించినందువల్ల చెంగయ్యను క్షమించి వదలి పెడుతున్నాము'.

అటు తరువాత ప్రిన్సిపాల్ రు. 200 లు చెంగయ్యకి బహుమతి యిచ్చారు. కానీ, ఈ రోజువరకూ, రౌడీ రంగడికి, వాడి సంసారానికి జరిగిన అన్యాయాన్నిగూర్చి పాపం చెంగయ్య చింతిస్తూనే ఉన్నాడు.

మన్నికకూ, నాణ్యమునకూ, సరైన కొలతకు

# ఒలింపిక్ బనియన్లు

ప్రసిద్ధి చెందినది.

తయారించువారు

ఒలింపిక్ నిట్టింగ్ కంపెని, తిరుపూరు-4